ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

05.08.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు.
2. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.
3. పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది.
4. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని, ఈ కారణంగా రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు తప్పవని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు అన్నారు.

--------

**ప్రవాసులు- పెట్టుబడులు:**

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జన్మభూమి తెలంగాణలోపెట్టే ప్రతి పెట్టుబడికి ప్రయోజనం ఉంటుందని అన్నారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ఆయన పునరుద్ఘాటించారు. రైతులు, మహిళలు, యువత అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టినట్లు చెప్పారు. భవిష్యత్తు లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధన కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు

వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేసినట్లు ఆయన కార్యలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. తమ నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలతో  అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చిన ప్రవాసులు ఇకపై తెలంగాణకు సేవలు అందించాలని కోరారు. రాష్ట్రాన్ని మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

---MSL

**వరంగల్ రీజినల్ కంటి ఆస్పత్రి-మంత్రి కొండా సురేఖ**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.  కంటి ఆరోగ్యం విషయంలో వైద్యులు జాగ్రత్తగా ఉండాలని, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని  సూచించారు. ఈ రోజు గ్రేటర్ వరంగల్ పరిధిలో పర్యటనలో భాగంగా  మంత్రి కొండ సురేఖవరంగల్  రీజినల్ కంటి  ఆసుపత్రిని   జిల్లా కలెక్టర్ సత్య శారదా తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు అందుతున్న వైద్య సేవలను వారితో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి కంటి ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి అక్కడి వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు.

(వరంగల్ జిల్లా,  పిటిసి)

**భద్రాద్రి కేటీపీఎస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా  పాల్వంచలోని కేటీపీఎస్ లో కాలం చెల్లిన 4 కూలింగ్ టవర్లను అధికారులు కూల్చివేశారు. అత్యంత భద్రత నడుమ ఏ, బీ, సీ స్టేషన్ లోని కూలింగ్ టవర్లను నేలమట్టం చేశారు. సుమారు 50 ఏళ్ల పాటు 680 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించిన ఈ కూలింగ్ టవర్ల సామర్థ్యం పడిపోవడంతో అధికారులు ఈ కూల్చివేత చేపట్టారు. 1965 -1978 మధ్య కాలంలో ఈ కూలింగ్ టవర్లను నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు.

(PTC, BDKM)

**సిరిసిల్ల-కూనంనేని**

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి ఘనమైన చరిత్ర ఉందని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిన్న రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్లు పూర్తి చేసుకొని డిసెంబరు 26 నాటికి 100వ ఏడాదిలో అడుగు పెట్టబోతుందని చెప్పారు.

(పిటిసి రాజన్న సిరిసిల్ల)

**షెడ్యూల్ బైట్ – సంపూర్ణత అభియాస్**

**కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణత అభియాస్ పథకం కింద నిర్మల్ జిల్లాలోని పెంబి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్టు పెంబి మండల విద్యాధికారి మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమం వివరాలను ఆయన ఆకాశవాణికి తెలియచేశారు.**

**(బైట్...)**

**పిటిసి, నిర్మల్**

**నాగర్ కర్నూల్- విద్యార్థులకు అస్వస్థత**

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో కలుషిత ఆహారం తిని18మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గత రెండు రోజులుగా బాలికలు కడుపునొప్పి, జ్వరం, వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొంతమంది బాలికలు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. నిన్న రాత్రి మరోసారి అస్వస్థతకు గురవడంతో విద్యార్థులను కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందజేస్తున్నారు. విషయం తెలిసిన రాష్ట్ర ఎక్సైజ్, శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆస్పత్రిని సందర్శించారు. బాలికలతో మాట్లాడి

వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. బాధ్యులపై శాఖాపర చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

(PTC, నాగర్‌కర్నూల్)

**స్వచ్ఛదనం-పచ్చదనం**

పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా నేడు స్థానిక నేతలు, మహిళా, యువజన సంఘాలు వార్డు కమిటీల సభ్యులతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

(డెస్క్)

**నల్లగొండ-గుత్తా సుఖేందర్ రెడ్డి**

వాతావరణ సమతుల్యాన్ని  కాపాడేందుకు చెట్లను ఎక్కువగా పెంచాల్సిన అవసరం ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన "స్వచదనం-పచ్చదనం" కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ  పచ్చదనాన్ని కాపాడాల్సిన అవసరం అందరిపై ఉందని, ఇందుకోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో విద్యార్థులు ,యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని, కోరారు. ఈ కార్యక్రమాన్ని కేవలం 5 రోజులు మాత్రమే  కాకుండా సంవత్సరం పొడుగునా నిర్వహించాలని ఆయన అన్నారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

**వాతావరణం-చిన్నారెడ్డి**

వాతావరణ సమతూల్యం కాపాడేందుకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి అటవీ సంపదను పెంపొందించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఈ రోజు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్

గంగ్వార్ తో కలిసి స్వచ్ఛతనం - పచ్చదనం కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రారంభించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణం లో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

(పిటిసి, వనపర్తి జిల్లా)

**సిరిసిల్ల- పచ్చదనం.. స్వచ్ఛదనం**

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చునని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం.. స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలకేంద్రంలోసోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ముస్తాబాద్ కొత్త బస్టాండ్ నుండి గ్రామపంచాయతీ వరకు ర్యాలీ నిర్వహించారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

**సిద్దిపేట-పచ్చదనం**

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మార్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో జరిగిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు.

(సిద్దిపేట జిల్లా పీటీసీ)

**కేటీఆర్-ఫిరాయింపులు**

రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు అన్నారు. ఈ కారణంగా రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు తప్పవని అన్నారు. అనర్హత విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకునేందుకు తారక రామారావు నేత్రుత్వంలోని బీఆర్ఎస్ నాయకుల బృందం ఈ రోజు న్యూఢిల్లీలో ప్రముఖ

న్యాయవాదులు, రాజ్యాంగ నిపుణులతో చర్చించింది. నిపుణుల సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని తారక రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర, కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

(పీఎన్)

**పురస్కారం- రేవూరి పద్మనాభరావు**

సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, అనంత లక్ష్మీకాంతం శారదా పీఠం హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిన్న వరంగల్ పట్టణంలోని సుబేదారిలోని పీఆర్ రెడ్డి భవన్ లో రేవూరి లక్ష్మీకాంతం రావు శతజయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పాజోస్యుల సత్యనారాయణకు అనంత లక్ష్మికాంత సాహితీ పురస్కారాన్ని ప్రసార భారతి విశ్రాంత అదనపు డైరెక్టర్ డాక్టర్ రేవూరి పద్మనాభరావు అందజేశారు. ఈ పురస్కార పూర్వపరాలను పద్మనాభరావు వివరించారు. ఇంతకు ముందు ఈ పురస్కారం పొందిన వారిలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ, ఎస్వీ బాలసుబ్రమణ్యం, ధారా రామనాథ శాస్త్రి, కేవీ రమణాచారి తదితర ప్రముఖులు ఉన్నారని చెప్పారు.

(పీఎన్)